క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ కందికల్‌గేట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫలక్‌నుమా, మదీనా కాలనీ, బండ్లగూడ మండల కార్యాలయం, ఫలక్‌నుమా రైతుబజార్, ఫలక్‌నుమా బస్ డిపో, ఇంజన్‌బౌలి, జహనుమా, ఫలక్‌నుమా ప్యాలెస్, వట్టేపల్లి, హబీబ్‌నగర్, రోషన్ కాలనీ, ఫారూఖ్‌నగర్, రవీంద్రనాయక్ నగర్ కాలనీ, గాంధీనగర్, ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ రోడ్డు, ఖాద్రీ చమన్, శివాజీనగర్, రాజన్న బావి, అలియాబాద్, శంషీర్‌గంజ్, ఛత్రినాక, గౌలిపురా, మురాద్‌మహల్ బాలాగంజ్, లాల్ దర్వాజ తదితర అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అంతర్జాతీయ స్థాయి ప్రో కబడ్డీ మ్యాచ్‌కు రెఫరీగా శ్రీను



చాంద్రాయణగుట్ట: ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో జరగనున్న ఆస్ట్రేలియా–ఇండియా ప్రో కబడ్డీ మ్యాచ్‌కు రెఫరీగా తెలంగాణ నుంచి చాంద్రాయణగుట్ట పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీను ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు జగదీశ్వర్ యాదవ్, అధ్యక్షుడు కాసాని వీరేశం, ప్రధాన కార్యదర్శి ఎం.మహేందర్‌రెడ్డి సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ..తెలంగాణ నుంచి తనను ఎంపిక చేసిన ద్రోణాచార్య అవార్డు గ్రహీత ప్రసాద్, ప్రో కబడ్డీ కమిషనర్ అనూప్ గోస్వామి, కాసాని జ్ఞానేశ్వర్‌కు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన ఆస్ట్రేలియా వెళ్లనున్నారు.

కవయిత్రి ప్రసన్న కిరణ్‌కు సత్కారం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ కవయిత్రి, రచయిత బీరా ప్రసన్న కిరణ్‌ను విమలా సాహితీ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పలు కవితలు, రచనల ద్వారా విశేష ప్రతిభ కనబరుస్తున్న కవయిత్రి ప్రసన్న కిరణ్‌ను సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా ప్రసన్న కిరణ్ మాట్లాడుతూ..సమాజంలో మానవాళి సంతోషకరంగా, మానసిక ఉల్లాసంగా, ఆనందంగా ఉండే విధంగా కొత్త తరహా కవితలను అందిస్తానన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ సంగీత కళలను ప్రోత్సహిస్తుందని తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో సాయి నృత్య డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్ష శ్రద్ధాంజలి పేరిట నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్య నేర్పిన గురువులను స్మరిస్తూ నృత్య ప్రదర్శన చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, నృత్య గురువులు శాలిని శ్రీనివాసన్, సౌమ్య శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొనడంతో స్థానిక బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పార్టీ చాంద్రాయణగుట్ట కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కౌడీ మహేందర్, చాంద్రాయణగుట్ట ఇన్‌చార్జి ఎడ్ల పండరీనాథ్, డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కృష్ణా నాయక్, సీనియర్ నాయకులు జాలిగం చిరంజీవి, మాదరి చంద్రశేఖర్, మధుకర్, పెండెం లక్ష్మణ్, బర్ల శ్రీనివాస్, అశోక్ రావు తదితరులు క్యాంపస్ ఆవరణలో కిషన్‌రెడ్డిని కలిసి పాతబస్తీ అభివృద్ధిపై చర్చించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నాంపల్లి: దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 55 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి బోరబండ–హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై తెలుపు, నీలం, నలుపు గళ్ల చొక్కా, నీలం రంగు జర్కిన్ ప్యాంటును ధరించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధీకులెవరైనా ఉంటే నాంపల్లి జీఆర్పీ పోలీసులను లేదా 90003 94635లో సంప్రదించాలని కోరారు.

శాంతికి చిహ్నం క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ



వేడుకల్లో నర్సింగ్‌రావు, కేఆర్.రాజ్‌కుమార్, భాస్కర్ తదితరులు

అబిడ్స్: శాంతికి చిహ్నం క్రిస్మస్ వేడుకలు అని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని గృహకల్ప కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా చేపట్టారు. డాన్‌బాస్కో అనాథ శరణాలయ చిన్నారులకు డాక్టర్ ముజీబ్ హుస్సేని దంపతుల తరఫున వస్త్రాలు, సరుకులు పంపిణీ చేశారు. అనంతరం మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..నగరంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు అట్టహాసంగా జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి వెంకట్, ఉమా, గీతా, శైలజ, మహ్మద్ జావీద్, సీమా ముజీబ్, ఉమర్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, విక్రమ్‌కుమార్, శ్రీధర్ నాయుడు, జానకి, దేవేందర్ పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

అబిడ్స్: డీఈఓ కార్యాలయంలో టీఎన్జీఓస్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘన ంగా నిర్వహించారు. సోమవారం టీఎన్జీఓస్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్ల ఆధ్వర్యంలో వేడుకలు జోరుగా చేపట్టారు. కేక్ కట్ చేసి మిఠాలు పంచిపెట్టారు. ముఖ్యఅతిథిగా గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ నర్సింగ్‌రావు పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ



శాంతాక్లాజ్, మేరీ మాత వేషధారనలో చిన్నారులు, ఉపాధ్యాయులు

వేడుకల్లో జయంతి రెడ్డి, అహ్మద్, ముజాహీద్ అలీ, ఠాకూర్, మొయినుద్దీన్, రమేష్, సూర్య, యూసుఫ్ పాషా, సుదర్శన్, అరుణ, లావణ్య, జెమ్స్, డేవిడ్ రతన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో..

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ నారాయణ ఈ–టెక్నో పాఠశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో క్రిస్మస్ ట్రీ, రంగు రంగుల విద్యుద్దీపాలను అందంగా అలంకరించారు. చిన్నారులు శాంతాక్లాజ్, మేరీ మాతా వేషధారణలో వచ్చి అలరించారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి పిల్లలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆలపించిన క్రిస్మస్ గీతాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐ.నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ గంగాకిరణ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

అబిడ్స్: గోషామహల్ పరిధిలోని గ్యాన్‌బాగ్ కాలనీ ప్రభుత్వ భూమిలో పార్కు నిర్మించాలని నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గ్యాన్‌బాగ్ కాలనీలో ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా తాను గతంలోనే జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. ఈ మేరకు సోమవారం నగర ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..గ్యాన్‌బాగ్ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమిలో జీహెచ్ఎంసీ పార్కు నిర్మిస్తే గోషామహల్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గ్యాన్‌బాగ్ కాలనీతో పాటు గోషామహల్ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ భూములను ప్రభుత్వం కాపాడాలన్నారు. ప్రజల కోసం వెంటనే



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

పార్కు నిర్మిస్తే ఎంతో బాగుంటుందన్నారు. గ్యాన్‌బాగ్ కాలనీ పరిసరాల్లో వేలాది కుటుంబాలు ఉంటాయని వారి కోసం ప్రభుత్వ జీహెచ్ఎంసీ పార్కు నిర్మించాలని ఆనంద్‌కుమార్ గౌడ్ సూచించారు.

చట్ట సభల్లో మేరు కులస్తులకు ప్రాధాన్యమివ్వాలి

అబిడ్స్: చట్ట సభల్లో మేరు కులస్తులకు అధిక ప్రాధాన్యమివ్వాలని టీపీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు.



మంత్రి శ్రీధర్ బాబును కలిసిన పోల్కం శ్రీనివాస్

సోమవారం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..40 ఏళ్లుగా గాంధీభవన్‌ను నమ్ముకొని కాంగ్రెస్ పార్టీ జెండాలు మోస్తున్న తనలాంటి సీనియర్లకు కార్పొరేషన్ పదవులు ఇచ్చి ఆదుకోవాలన్నారు. పార్టీకి క్రమశిక్షణగా ఉన్న వారికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా ఎంతో వెనుకబడిన మేరు కులస్తులకు చట్టసభల్లో ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. గత అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపులో మేరు కులస్తులు కీలక పాత్ర పోషించారన్నారు.

నటీనటులను ప్రోత్సహించడం అభినందనీయం



రచ్చరవికి పురస్కారాన్ని అందజేస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: నటీనటులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. సోమవారం రవీంద్రభారతిలో సారంగి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సారంగి ఫిల్మ్ అవార్డ్స్–2024లను పలువురు నటీనటులకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..ప్రపంచంలో అత్యంత సంక్లిష్టమైన వృత్తుల్లో ఒకటి రాజకీయం, రెండవది సినిమా అన్నారు. సినీ దర్శకుడు ఉడుగుల వేణు మాట్లాడుతూ..వివిధ విభాగాల్లో నటీనటుల ప్రతిభను గుర్తించి అవార్డులు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం పలువురు నటీనటులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సినీ విమర్శకులు పొన్నం రవిచంద్ర, నటుడు రచ్చరవి, నటీనటులు భావన, మైమ్ మధు, చైతన్యరావు, రచయితలు కాసర్ల శ్యామ్, సంజయ్‌కిషోర్, ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా అఫ్రీది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు బ్రేక్

నాంపల్లి: రోడ్డు విస్తరణలో భాగంగా మల్లేపల్లి చౌరస్తాలో నెలకొన్న ఆక్రమణలను కూల్చివేసి రాత్రికి రాత్రే రోడ్డును వేసిన జీహెచ్ఎంసీ అధికారులకు ఏమైందో ఏమో తెలియదు గానీ అర్ధాంతరంగా కొత్తగా వేసిన రోడ్డును మళ్లీ మూసివేశారు.



వేసిన రోడ్డుపై బారికేడ్లను అమర్చిన జీహెచ్ఎంసీ అధికారులు

విస్తరణకు నోచుకున్న రోడ్డులో వాహనదారులు, పాదచారులు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లను అమర్చారు. కాసింత దూరం కోసం రూ.17 లక్షలు వెచ్చించి వేసిన రోడ్డు ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఇప్పుడు ప్రజా ధనంతో ఖర్చుచేసిన నిధులు బూడిదలో పోసిన పన్నీరులాగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారి నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఉంటోంది. ఈ ట్రాఫిక్ చిక్కుల్లోని నగర వాసులు బయటపడాలంటే రోడ్డుపై వేసిన బారికేడ్లను వెంటనే తొలగించాలని కోరుతున్నారు. రోడ్డును మూసివేసి నెల రోజులు కావస్తున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ సర్కిల్–12 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లాల్ సింగ్‌ను వివరణ కోరగా ఆయన స్పందించలేదు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పూజల్లో గోవర్ధన్ తదితరులు

గోల్కొండ: సబ్జిమండిలోని మణికంఠ సన్నిదానంలో సోమవారం కర్రె వీరన్న 18వ పడిపూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. గురు వినయ్ గురుస్వామి ఆధ్వర్యంలో భక్తులు శబరిమలకు పాదయాత్రతో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఆనందేశ్ విజయ్‌కిషోర్, సబ్జిమండి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కట్ట లింగం తదితరులు పాల్గొన్నారు.

నేతాజీనగర్‌లో..

అఫ్జల్‌గంజ్: అయ్యప్ప స్వామి మహా పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. నేతాజీనగర్‌లో అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పడిపూజ చేపట్టారు. భజనలు, భక్తి గీతాలతో అలరించారు. ఈ అయ్యప్పస్వామి మహా పడిపూజలో జి.నిర్మల్, సుధీర్, టి.గోవర్ధన్, అభినవ్, జశ్వంత్, అభిలాష్, చేతన్, రాజు, జగ్గు తదితరులు పాల్గొన్నారు.



శబరిమలకు బయలుదేరుతున్న గురు వినయ్ గురుస్వామి

రేపు దారుషిఫాలో ఉచిత మెగా వైద్య శిబిరం



కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

చార్మినార్: ఈనెల 25న దారుషిఫాలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రి తెలిపారు. ఈ మేరకు కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డిని కలిసి ఉచిత మెగా వైద్య శిబిరం వివరాలను తెలియజేశామన్నారు. సోమవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించామన్నారు. భారత మాజీ ప్రధాన మంత్రి, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్, బీజేపీ మెడికల్ సెల్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఏ. సురేందర్, బీజేపీ మెడికల్ సెల్ ఇన్‌చార్జ్ డాక్టర్ కే.భాస్కర్ రావు, కో కన్వీనర్ మౌనిక సుంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్ ప్రజల పార్టీ: ఎమ్మెల్యే కౌసర్



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

గోల్కొండ: మజ్లిస్ ప్రజల పార్టీ అని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారుల కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ ఎప్పుడు ప్రజల పక్షాన ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా కార్వాన్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో తాను అభివృద్ధి పనులు చేయించానన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు సయ్యద్ రఫత్‌హుస్సేన్ ఉన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో జాతీయ స్థాయి క్విజ్ పోటీలు



గోల్కొండ: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. హ్యూమానిటీస్, మెథమ్యాటిక్స్ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో ఈ పోటీలు నిర్వహించారు. మూడు రౌండ్ల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 95 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి డాక్టర్ రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీఎన్ఐటీఎస్‌లో ఇటువంటి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, డాక్టర్ ఎం.మాధవీలత, డాక్టర్ ఎం.అపర్ణ, కోఆర్డినేటర్ ఎస్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ అధికారులు కోరారు. చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో సోమవారం జోనల్ కార్యాలయంలో ప్రజావాణిని నిర్వహించారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ పరిధిలోని అలీజా కోట్ల ప్రాంతంలో అక్రమ నిర్మాణంపై ఒక్క ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శైలజ, ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి,



ప్రజావాణిలో జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ అధికారులు

యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బీ, టౌన్ ప్లానింగ్ సీపీ ఎంఏ మాజీద్, ఏఎంసీ రాజారావు, సీనియర్ అసిస్టెంట్ హమీద్, బిల్ కలెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలి



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన యాకుత్‌పురా, రెయిన్‌బజార్, ఎస్సార్టీ కాలనీ, యక్రమ్‌నగర్, చోటాపూల్ ప్రాంతాల్లో రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి పర్యటించి అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..కొని రోజుల క్రితం డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, వాటర్ ఫౌంటెయిన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఈ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఓ ప్రణాళికతో ముందుకెళ్తున్నామని ఆయన తెలిపారు.

‘ఏఐ’తో జాగ్రత్తగా ఉండాలి

చార్మినార్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ (ఏఐ)తో జాగ్రత్తగా ఉండాలని క్యాప్టెన్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ సూచించారు. ప్రభుత్వ సిటీ కాలేజి కామర్స్–మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంకేతిక యుగంలో వినియోగదారుల సాధికారతపై ప్రత్యేక చర్చా కార్యక్రమం జరిగింది. ఎంపవరింగ్ కన్స్యూమర్స్ ఇన్ ది ఏఐ ఎరా: రైట్స్, రెస్పాన్సిబిలిటీస్, అండ్ ఛాలెంజెస్ అనే అంశంపై ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ సహాయచార్యులు కెప్టెన్ డా.ఎన్. శ్రీనివాస్ మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో వినియోగదారులు ఎదుర్కొనే సవాళ్లను, వాటిని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. సిటీ కాలేజి కామర్స్–మేనేజ్‌మెంట్ విభాగాధ్యక్షులు డా.కె. మల్లికార్జునరావు మాట్లాడుతూ.. వినియోగదారుల ప్రవర్తన, నిర్ణయాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ప్రభావితమవుతున్న ఈ తరుణంలో వినియోగ దారులు అవగాహన పెంచుకోవటంతో పాటు అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శిరీష, ఇఫత్ ఉన్నీసా, లలిత చైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెప్టెన్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్

కురుమలు ఐక్యంగా ఉండాలి

జియాగూడ: కురుమ కులస్తులు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా ఎదగాలని శాంతామయ్య స్వామీజీ అన్నారు. జియాగూడలోని ఎంసీహెచ్ గ్రౌండ్‌లో శ్రీభక్త కనకదాస్ 537వ జయంతి ఉత్సవ్‌ను పురస్కరించుకొని జియాగూడ మల్లమ్మ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఈ సందర్భంగా శ్రీభక్త కనకదాస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ..కర్ణాటకలో తరహా తెలంగాణలో కురుమ కులస్తులు అధిక జనాభా ఉన్నందున రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ బోయిని దర్శన్, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాసు మాట్లాడుతూ... కురుమలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట్ మార్కెట్ డైరెక్టర్ మాదారం కృష్ణ, సంఘం చైర్మన్ వామనరావు వైజీనాథప్ప హీరోడే, కుంటబీర్ జగన్నాథ్, అధ్యక్షులు హన్మంత్ హీరోడే, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ హీరోడే, విఠల్ పూజారి, ఇ.రమేష్, ప్రభు పూజారి, కె.శివాజీ, కోశాధికారి గోండా రమేష్, రమేష్ దొడ్డామని, శంకర్ మారగొండ, బీజేపీ నాయకులు మాణిక్ ప్రభు, తులసిదాస్ పాల్గొన్నారు.



శాంతామయ్య స్వామీని సన్మానిస్తున్న కార్పొరేటర్ బోయిని దర్శన్, దేవర శ్రీనివాస, అమర్నాథ్

ప్రత్యేక పూజలు

చార్మినార్: మీరాలంమండి అమ్మవారికి ఆదివారం రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన పంచహారతి, మహాభిషేకం పూజా కార్యక్రమాల్లో స్థానిక భక్తులతో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొన్నారు. అఖిల భారత గో సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బాలకృష్ణ గురుస్వామితో పాటు పాటేల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ యాదవ్, ప్రముఖ రియల్టర్ కోటిరెడ్డి, బీజేపీ నాయ కులు ప్యారసాని వెంకటేష్ పాల్గొన్నారు.



స్నేహితుడి ఇంట్లో చొరబడి తల్వార్లతో హల్‌చల్

కేసు నమోదు

లంగర్‌హౌస్: గంజాయి తాగుతున్న విషయం పోలీసులకు చెబుతావా అంటూ ఓ వ్యక్తి స్నేహితుడి ఇంట్లోకి చొరబడి హంగామా సృష్టించిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై దీపిక వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్‌లోని భాష్యంనగర్‌కు చెందిన మీర్ అమీర్ అలీ, చింతల్‌మెట్‌లో నివాసముండే హాజీ, అబ్దుల్ హసన్ స్నేహితులు. వీరు గంజాయి తాగుతుంటారు. ఇటీవల ఈ ముగ్గురిని ఓ కానిస్టేబుల్ విడివిడిగా కలిసి గంజాయి తాగుతున్నారా అంటూ ప్రశ్నించారు. అయితే తాను గంజాయి తాగుతున్న విషయం పోలీసులకు నువ్వే చెప్పావని మీర్‌అమీర్ అలీ, హాజీని నిలదీశాడు. నిన్ను పట్టుకోవడానికి ఈ నెల 21న రాత్రి ఇంటికి పోలీసులు వస్తారని మీర్ అమీర్ అలీకి తెలిపారు. కోపంతో హాజీ ముగ్గురు స్నేహితులతో కలిసి మీర్ అమీర్ అలీ ఇంటికి వచ్చి మీర్ అమీర్ అలీతో పాటు అతడి భార్య ముఫ్వీనా ఫాతిమాను బెదిరించి వారిపై దాడి చేశారు. ఫాతిమా కేకలు వేయడంతో నిందితులు పారిపోయారు. హాజీ తల్వార్ తిప్పుతున్నట్లు వీడియో తీసి కానిస్టేబుల్‌ను కూడా వదలనంటూ ఆ వీడియోను మీర్ అమీర్ అలీకి పంపించాడు. ముఫ్వీనా ఫాతిమా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.